క్లుప్తంగా

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'



కథలు పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ శాఖాధికారి రమణ విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అందులోని నీతిని బోధించారు.

చకచకా రామాలయ నిర్మాణం



రామాలయం శ్లాబ్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు సిద్దేశ్వరంలో కొత్తగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం శ్లాబ్ పనులు చేపట్టారు. ఈ పనులను కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. అలాగే దల్లివానిపాలెంలోని నూకాంబిక ఆలయంలో అమ్మవారి గర్భగుడి ద్వారం పనులను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనసంఘ్ మానవతా సిద్ధాంత కర్త పండిట్ దీన్ దయాళ్ వర్ధంతి (బలిదాన్ దివస్)ని పాతకర్ణవానిపాలెంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోహిణి, కట్టా పద్మ, సోంబాబు, జీలకర్ర భువనేశ్వరి, ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా వేణువర్మ



డీసీసీ అధ్యక్షుడి నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న వేణువర్మ

ఉక్కునగరం: విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బుద్దరాజు వేణువర్మ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంప గోవిందరాజు నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు వేగి వెంకటేష్, కార్యదర్శి గుత్తల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణువర్మను స్టీల్ ఇంటక్ నాయకులు వి.ఎం.నాయుడు, డి.మోహన్, ఆర్.కోటేశ్వరరావు అభినందించారు.



మార్గం.. సుగమం

నిధులు :	చేపట్టిన పనులు :
రూ. 1.20 కోట్లు	2.5 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ

లబ్ధి : 15 గ్రామాల ప్రజలకు తప్పిన అవస్థలు

నాడు
అసలే ఇరుకు రోడ్డు.. ఆపై మలుపులు.. అతుకులు..గతుకులతో ఆ ప్రాంతంలో ప్రయాణమంటేనే ప్రాణసంకటంగా భావించే పరిస్థితి..

నేడు
పరిస్థితి మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రహదారుల నిర్మాణం, ఇరుకు రోడ్ల విస్తరణపై దృష్టి సారించింది. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రోడ్లు ఇప్పుడు **రాచమార్గాలుగా మారాయి.**



వెదుళ్లనరవ కొండవాలు ప్రాంతంలో వెడల్పు చేసిన రోడ్డు

- రూ.కోటి 20 లక్షలతో ఇరుకు దారికి మోక్షం
- దువ్వాడ సెక్టార్–1 నుంచి అజనగిరి వరకు రహదారి విస్తరణ
- రెండు మండలాల్లో ప్రజలకు తీరిన అవస్థలు

అగనంపూడి: దువ్వాడ సెక్టార్–1 నుంచి అజనగిరి (నంగినారపాడు) వరకు ఉన్న రహదారిని విస్తరించడంతో రెండు మండలాలవాసులకు రోడ్డు కష్టాలు తప్పాయి.

గతంలో ఇదీ పరిస్థితి..

జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి దువ్వాడ సెక్టార్–1 వరకు రహదారిని గతంలోనే విస్తరించారు. కానీ సెక్టార్–1 నుంచి జీవీఎంసీ పరిధి వరకు అంటే అజనగిరి (నంగినారపాడు) వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల రహదారి ఇరుగ్గా, గోతులతో, కోతకు గురై ఉండేది. టీడీపీ ప్రభుత్వం హయాంలో రహదారి విస్తరణకు హామీ ఇచ్చి గాలికి వదిలేయడంతో అప్పట్నుంచి ఈ మార్గంలో ప్రయాణం అంటేనే హడలిపోయే పరిస్థితి ఏర్పడింది.

నేడు తీరిన వెతలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రూ.1 కోటి 20 లక్షల వ్యయంతో రహదారి విస్తరణ పనులు చేపట్టింది. రహదారికిరువైపులా నాలుగు మీటర్ల వెడల్పులో విస్తరించారు. గతంలో నాలుగు మీటర్లు ఉండే రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగేది. వీటికి తోడు వెదుళ్లనరవ, కాలనీ, నంగినారపాడు గ్రామాల వద్ద రహదారి మలుపులు ఉండడంతో వాహనచోదకులు భయాందోళన చెందేవారు. వెదుళ్లనరవ గ్రామం దాటిన తరువాత కొండవాలు ప్రాంతంలో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకునేవి. రహదారి విస్తరణతో మలుపుల వద్ద వెడల్పు పెరగడంతో ప్రయాణికులకు టెన్షన్ నుంచి విముక్తి కల్గింది. ఈ మార్గంలో గాజువాక, సబ్బవరం మండలాలకు చెందిన సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ఈ మార్గంలో ఇటీవల దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి చోడవరం వరకు సిటీ బస్ సౌకర్యం ఏర్పాటు చేశారు.



అజనగిరి వద్ద విస్తరించిన రహదారి



వెదుళ్లనరవ, కొత్తూరు కాలనీ మధ్య ఇరుకు రోడ్డు



వెదుళ్లనరవ, కొత్తూరు కాలనీల మధ్య విస్తరించిన రోడ్డు

రోడ్డు కష్టాలు తీరాయి



గతంలో వెదుళ్లనరవ కాలనీ నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో వాహనాలను నెమ్మదిగా నడపాల్సి వచ్చేది. ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే 20 నిమిషాల సమయం పట్టేది. రహదారి విస్తరణతో సగం సమయం ఆదా అవుతోంది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం చొరవ తీసుకొని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారిని విస్తరించి, వాహనచోదకుల అవస్థల నుంచి గట్టెక్కించారు.

– బి.సత్యనారాయణ, వెదుళ్లనరవ కాలనీ

పదేళ్ల సమస్య పరిష్కారమైంది



గత ప్రభుత్వ హయాంలో రహదారి విస్తరణ చేపడతారని హామీ ఇచ్చారు. గొల్లలపాలెం వరకు రహదారి విస్తరించి మధ్యలో వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంగినారపాడు, వెదుళ్లనరవ, కాలనీ, కొత్తూరు, దువ్వాడ–1 గ్రామస్తులు, సబ్బవరం, గాజువాక మండలాల ప్రజలు పడుతున్న రహదారి ఇక్కట్లు తీర్చింది. సంతోషంగా ఉంది.

– పి.హరనాథ్, దువ్వాడ నిర్వాసిత కాలనీ

వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న మెడికవర్ ఆస్పత్రి వైద్యులు

పెదగంట్యాడ: అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సహకారంతో దిబ్బపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన రోగులకు రక్తపరీక్షలు, బీపీ, సుగర్, ఈసీజీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్ తదితర పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. గంగవరం పోర్టు సీఎస్సార్ మేనేజర్ రమేష్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 8న మహిళల కోసం క్యాన్సర్ మెగా క్యాంపులు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, కృష్ణవేణి, వాణి, సత్యానందం, రాజు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెంకు చెందిన వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా నున్నా గాంధీ గుప్తా, కార్యదర్శిగా గుడిమెట్ల కుమారస్వామి, కోశాధికారిగా నున్నా శ్రీరామ్మూర్తి ఎన్నికయ్యారు. డిస్ట్రిక్ట్ 201 ఏ గవర్నర్ వీవీ గుప్తా ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించగా ఎ.సునీత సమక్షంలో ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఉద్దగిరి కుమార గుప్తా, క్యాబినెట్ ట్రెజరర్ కట్టా సతీష్, కేసరపు నాగేశ్వరరావు, జెడ్‌సీ సింగంశెట్టి సతీష్ కుమార్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ బంగార్రాజు, కటకం శైలజ, పూసర్ల జగదీష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉరుకూటి చందుకు యాదవుల మద్దతు

ఆత్మీయ సమావేశంలో ఆ సామాజికవర్గ నాయకుల ప్రకటన



యాదవుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉరుకూటి చందు



సమావేశానికి హాజరైన యాదవ సామాజికవర్గానికి చెందిన నాయకులు

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు)కు నియోజకవర్గానికి చెందిన యాదవ సామాజికవర్గ నాయకులు మద్దతు ప్రకటించారు. గాజువాక మెయిన్‌రోడ్డులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన యాదవుల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన.. యువకుడైన చందును సమన్వయ కర్తగా నియమించారన్నారు. యాదవ సామాజిక వర్గానికి పార్టీలో సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గంలో ఉరుకూటి చందును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

గాజువాక విజయాన్ని బహుమతిగా ఇద్దాం

ఉరుకూటి చందు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అందులో భాగంగానే గాజువాక సమన్వయకర్తగా తనను నియమించారని చెప్పారు. తనను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. ఈ నియోజకవర్గం నుంచి విజయం సాధించి బహుమతిగా ఇవ్వడానికి యాదవులంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గాజువాక నియోజకవర్గాన్ని అందరి సహకారంతో మరింతగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని, అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

కలసికట్టుగా ముందుకు వెళ్దాం

యాదవ సంఘం నాయకుడు ఉరుకూటి అప్పారావు మాట్లాడుతూ ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందించి, మళ్లీ 2024లో అధికారం ఇవ్వాలని అడుగుతున్న వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గాజువాకలో ఎంతోకాలంగా మరుగున పడి ఉన్న హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించడంతో ఆపటు ఫార్మాసిటీ నిర్వాసితులకు పట్టాలు ఇచ్చిన ఘనత మన సీఎంకే దక్కుతుందన్నారు. ఆయన ఎంతో నమ్మకంతో నిలబెట్టిన చందుకు అందరం కలిసికట్టుగా ఉండి సహకరిద్దామన్నారు. గ్రామాల్లో అన్ని కులాల పెద్దలతో కలిసి ముందుకు వెళ్లాలని నాయకుడు చొప్పా నాగరాజు కోరారు. సమావేశంలో నక్క లక్ష్మణరావు, నమ్మి సత్యనారాయణ, కోమటి శ్రీనివాసరావు, ఎల్లాజీరావు, యలమంచిలి చినఅప్పారావు, మాడిశ రాజు, గొలగాని నాయుడు, పల్లా ఎల్లాజీరావు, ఉరుకూటి బాబూరావు, పల్లా నూకరాజు, గొలగాని అప్పారావు, నమ్మి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'దర్జీలంతా ఐక్యంగా ఉండాలి'



అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని సత్కరిస్తున్న దర్జీలు

అక్కిరెడ్డిపాలెం: దర్జీలంతా ఐకమత్యంతో ఉండాలని న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతినిశెట్టి సత్యనారాయణ కోరారు. కష్టంలో ఉన్న దర్జీలను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. వినాయక దుర్గా టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీహెచ్‌పీవీ వద్ద ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దర్జీలను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతీ దర్జీ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమితులైన కూనూరు మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో టి.పుల్లయ్య నాయుడు, దొడ్డి శ్రీనివాస్, కె.శంకరరావు, కె.శ్రీనివాస్, చిన్నారావు పాల్గొన్నారు.

35 మద్యం బాటిళ్ల స్వాధీనం

పరవాడ : అక్రమ మద్యం కేసులో పరవాడ పోలీసులు ఆదివారం ముగ్గురిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని లంకెలపాలెం గ్రామానికి చెందిన జోగి నూకాలమ్మ పాన్‌షాపులో అక్రమంగా మద్యం అమ్ముతుందని అందిన సమాచారంతో పరవాడ ఎస్‌ఐ ఎస్.సురేష్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. తనిఖీల్లో రూ.2,600 విలువ చేసే 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఫార్మాసిటీకి చెందిన సి.నరసింగరావు వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా లంకెలపాలెంలోని వినాయకనగర్ ఎస్‌ఐ మల్లేశ్వరరావు సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.2,520 విలువ చేసే 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని వెన్నెలపాలెంకు చెందిన దొడ్డి మహాలక్ష్మి నాయుడు వైన్‌షాప్‌లో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.1,580 విలువ చేసే 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రీమియర్ లీగ్ టోర్నీ విజేత స్టీల్ టైటాన్స్



స్టీల్ టైటాన్స్ జట్టుకు షీల్డు అందజేస్తున్న అతిథులు

ఉక్కునగరం: ఉక్కు ఎంప్లాయిస్ ప్రీమియం లీగ్ టోర్నమెంట్‌లో స్టీల్ టైటాన్స్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక ఉక్కు స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో స్టీల్ వారియర్స్, స్టీల్ టైటాన్స్, స్టీల్ ఎవెంజర్స్, ఉక్కు రాయల్స్, ఉక్కు సూపర్ గ్రీన్ జట్లు పాల్గొన్నాయి. 11 రోజుల పాటు జరిగిన టీ 20 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. స్టీల్ టైటాన్స్, ఉక్కు రాయల్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్టీల్ టైటాన్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్ జట్టు 19 ఓవర్లలో 143 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్టీల్ టైటాన్స్ జట్టు 18.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి, లక్ష్యాన్ని ఛేదించింది. టైటాన్స్ జట్టుకు చెందిన బ్యాట్స్‌మన్ యు. రమేష్ 50 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, కోక్‌ఓవెన్స్ జీఎం ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఏసీఎస్ విభాగం జీఎం వి. చిట్టిబాబు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెంటార్ ఇ. వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణ .. అందరి బాధ్యత



1095వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు తెలుగువారంతా పోరాటానికి సిద్ధం కావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారానికి 1095వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే స్టీల్‌ప్లాంట్ అంశంలో సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని ఆరోపించారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులను మోసం చేస్తోందని, కార్మికులకు పనిలేకుండా చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఎంతటి త్యాగానికైన సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినం



వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నడుపూరు జ్ఞానమందిరంలో కన్యకాపరమేశ్వరికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మాహుతి మహోత్సవాలను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డు సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయంలో పెదగంట్యాడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం హోమం చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో చెరుకూరి నరసింహమూర్తి, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, ముగలపల్లి తిరుపతిరావు, కొల్లా అప్పలరాజు, ఎస్ఎస్ఎస్, కుమార్ పాల్గొన్నారు.

పెదనడుపూరులో..

76వ వార్డు పెదనడుపూరులోని వాసవీ జ్ఞాన మందిరంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, కులుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు భజనలు చేశారు. కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో బెల్లాల వెంకటరావు, బెల్లాల నాగేశ్వరరావు, చిన్న శంకరరావు, పండు, బొడ్డు వెంకటరావు, పెంటాజీ, చిట్టితల్లి తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో శ్యామ నవరాత్రి ఉత్సవాలు



దేవీపురంలో తమలపాకుల అలంకరణలో రాజశ్యామల అమ్మవారు

సబ్బవరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో శ్యామ నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజశ్యామల అమ్మవారు తమలపాకులతో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారికి సకల అరిష్టాలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2.12 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన పిల్లా భాస్కరరావు దంపతులు రూ.1,01,116లు, మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ఎం.సీతాపతిరావు రూ.1,11,111లు విరాళంగా అందజేశారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాతలు సంబంధిత విరాళాలను నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు అన్నప్రసాదం పథకం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్‌లు అందజేశారు.

సింహాచలేశునికి స్వర్ణ సంపెంగలతో అర్చన



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. అందులో భాగంగా స్వామివారికి ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన చేశారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.